క్లుప్తంగా

ఉచితంగా కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ చేసుకున్న వారితో వైద్యులు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో కంటి సమస్యతో బాధపడుతున్న తొమ్మిది మందికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా కంటి ఆపరేషన్లు పూర్తిచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు 106 మందికి కంటి ఆపరేషన్లు చేశామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్లు రత్నమాల, నర్సింగం, రాజేందర్, తదితరులు ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగంకుమార్

చందుర్తి/ఇల్లంతకుంట: యువతకు ఉపాధి మార్గం కల్పించాలనే సంకల్పంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణను మండలంలోని అన్ని గ్రామాల యువతులు సద్వినియోగం చేసుకోవాలని చందుర్తి జెడ్పీటీసీ సభ్యులు నాగంకుమార్ కోరారు. చందుర్తి మండలకేంద్రంలో ఉచిత కుట్టుశిక్షణను, బ్యూటీషన్ శిక్షణను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. 45 రోజులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఇల్లంతకుంటలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య కిషోర బాలికలకు అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. బ్యూటీషన్ కోర్సుటీచర్ అపర్ణ అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, విజయలక్ష్మి అనిత, జ్యోతి, సంధ్య, సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత



బైక్ అందిస్తున్న మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్

వేములవాడరూరల్: మండలంలోని బాలరాజుపల్లికి చెందిన కొమ్ము శ్రావణ్‌కుమార్ నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగుడు కొన్నిరోజులుగా నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న కోనరావుపేట మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, ఆయన స్నేహితుడు పాక శ్రీనివాస్ సొంత ఖర్చుతో రూ.1.5లక్షలు విలువైన బైక్‌ను వేములవాడలో శనివారం అందించారు. స్నేహితుల సహకారంతో ఇప్పటికే పలుమండలాల్లో ఆక్సిజన్ మిషన్లు వికలాంగులకు బైక్‌లు అందించామన్నారు. మున్ముందు ప్రతీ గ్రామానికి చేయూతనందిస్తామన్నారు. ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ప్రజాప్రతినిధులు, వికలాంగుడు కొమ్ము శ్రావణ్‌కుమార్, కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



వాహనాలను తరలిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో ధాన్యం సేకరణ ముగిసిందని పోతుగల్ సింగిల్ విండోచైర్మన్ తన్నీరు బాపురావు తెలిపారు. జిల్లాలోనే తొలి కొనుగోలుకేంద్రాన్ని దిగ్విజయంగా ముగించామని పేర్కొన్నారు. శనివారం చివరి ధాన్యం వాహనాలను రైస్‌మిల్లులకు తరలించామన్నారు. సర్పంచ్ కాశోల్ల పద్మ, నాయకులు, రైతుల సహకారంతో 131 మంది రైతుల వద్ద 3,357 క్వింటాళ్ల ధాన్యం సేకరించామన్నారు. రైతుల ఖాతాల్లో రూ.33.18 లక్షలు జమచేశామన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా రైతుల వద్దనుంచి ధాన్యం సేకరించామన్నారు డైరెక్టర్లు సతీశ్‌చందర్‌రావు, శ్రీనివాస్, సీతవో కృష్ణ, మేనేజర్ రాజేశ్వర్‌రావు, దుర్గప్రసాద్, రంజిత్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్ ‘వేడి’ కేంద్రాలు!



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



వేసవి సెలవుల కోసం డీడబ్ల్యూవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- ఎండలకు తాళలేకపోతున్న చిన్నారులు
- వేసవి సెలవులు ఇవ్వాలంటున్న తల్లిదండ్రులు

గంభీరావుపేట: ఎండలు దంచికొడుతున్నాయి. వార్షిక పరీక్షలు ముగియడంతో పాఠశాలలు, కళాశాలలకు వేసవిసెలవులు ప్రకటించారు. కానీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు మాత్రం రోజూ కేంద్రాలకు వెళ్లివస్తున్నారు. వేసవిసెలవులు ఇవ్వకపోవడంతో అంగన్‌వాడీకేంద్రాలకు వెళ్లే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు ఎండవేడిమికి తట్టుకోలేక ఇబ్బంది పడుతు న్నారు. ఓవైపు 42–44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటలకే ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు వెళ్లాలంటే వారిపై ఎండ ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాలకు వేసవిసెలవులు ప్రకటించి నెలకు సరిపడ పౌష్టికాహారాన్ని ఇంటికే పంపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వేసవి సెలవుల కోసం లబ్ధిదారులు రోజు అడుగుతున్నారని టీచర్లు అంటున్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారికి టీచర్లు వేసవి సెలవుల కోసం వినతిపత్రం అందించారు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 560 ప్రధాన, 27 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం అంగన్ వాడీ కేంద్రాలు ఒంటిపూట కొనసాగుతున్నాయి. మిగతా పాఠశాలల మాదిరిగా కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎండలకు ఇబ్బందిగా ఉంది



ఎండలు కొడుతున్నా బాబును అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్తున్నాను. ఉదయం నుంచే ఎండలు తీవ్రమై బయటకు వెళ్లేపరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను బడికి ఎలా పంపించాలి. కేంద్రాలకు వేసవి సెలవులు ఇచ్చి పౌష్టికాహారాన్ని ఇంటికి పంపించాలని అధికారులను కోరుతున్నాం.

– బండ స్నేహ, చిన్నారి తల్లి, గంభీరావుపేట

వేసవి సెలవులు ప్రకటించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని అధికారులకు విన్నవించాం. సానుకూలంగా స్పందించి సెలవులు ప్రకటిస్తారని భావిస్తున్నాం. ఎండలకు పెద్దవారే బయటకు రాలేని పరిస్థితిలో చిన్నారులు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– కల్లూరి చందన, అంగన్‌వాడీ టీచర్స్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

సర్వేలే తప్ప... రైతన్నకు పరిహారమేది?

- గొర్రెల పంపిణీపై నాయకుల మధ్య రగడ
- వాడీవేడిగా మండల సభ
- సభ మర్యాద కాపాడండి..
- ఎంపీపీ బండ మల్లేశంయాదవ్



ఎంపీటీసీ, సర్పంచ్‌ల మధ్య వాదోపవాదాలు

వేములవాడరూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు సర్వేలు తప్ప పరిహారం అందడం లేదని మాజీ ఎంపీపీ, వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం అన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని... పరిహారం వెంటనే వస్తదని అధికార పార్టీ నాయకులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి సమాధానమిచ్చారు. అయినప్పటికీ ఇద్దరి మధ్య పెరిగిన మాటల యుద్ధంతో మండల సభ రసాబాసగా సాగింది. స్పందించిన ఎంపీపీ బండ మల్లేశం ఇది మండల సర్వసభ్య సమావేశమని, సభ మర్యాదలు కాపాడాలని, అధ్యక్షుల అనుమతితోనే మాట్లాడాలంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో శనివారం జరిగింది. ఎంపీపీ బండ మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖపై ఏవో సాయికిరణ్ వివరిస్తుండగా వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం మాట్లాడుతూ.. గతంలో వడగండ్ల వానకు నష్టం జరిగినప్పటికీ ఇప్పటి వరకు పరిహారం రాలేదని, మళ్లీ ఈ మధ్య నష్టం జరిగినప్పటికీ సర్వేలు చేసి చేతులు దులుపుకున్నారని, పరిహారం వస్తదా? రాదా అని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వం అంటున్నారే తప్ప రైతులకు చేసిందేమి లేదన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ ఇప్పటి వరకు జరగలేదన్నారు. 2019లో ఎమ్మెల్యే రమేశ్ బాబు పంట నష్టంపై వట్టెంల, నూకలమర్రి, ఫాజుల్‌నగర్ గ్రామాల్లో పర్యటించి ఇప్పటి వరకు పరిహారం ఇప్పించలేదన్నారు. స్పందించిన అధికార పార్టీ నాయకుడు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేసిందేమి లేదని, మా ప్రభుత్వమే రైతులకు అండగా నిలుస్తూ ఎన్నో పథకాలను అందిస్తోందన్నారు. రెండు రోజుల క్రితమే మంత్రివర్గ సమావేశంలో పరిహారంపై ప్రత్యేకంగా చర్చించామన్నారు. ఎమ్మెల్యేపై వ్యక్తిగతంగా ఈ సభలో మాట్లాడడం సరికాదంటూ ఎంపీటీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిద్దరి మధ్య కొంతసేపు వాదోపవాదాలు జరగ్గా ఎంపీపీ మల్లేశం కలుగజేసుకుని ఇష్టం వచ్చినట్లు ఈ సమావేశంలో మాట్లాడడం సరికాదని, సభ అధ్యక్షుల అనుమతితోనే మాట్లాడాలని అన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు మందకోడిగా సాగుతున్నాయని, వెంటనే తూకం వేసి ధాన్యం తరలించాలన్నారు. తరుగు పేరుతో మిల్లర్లు కోతలు విధిస్తున్నారని, అలాంటివేమి లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అనంతరం అన్నిశాఖల అధికారులు ఈ సమావేశంలో శాఖల పనితీరుపై వివరించారు. జెడ్పీటీసీ ఏశవాణి, వైస్ ఎంపీపీ జక్కుల కవిత, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, పీఆర్ డీఈ సత్యానారాయణ, ఎంపీటీసీలు బొద్దు శంకరవ్వ, వెలుమ నర్సవ్వ, మల్లారం తిరుపతి, సర్పంచ్‌లు సామ కవిత, సుద్దాల లచ్చయ్య, ఎంపీడీఓ రాంరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంభీరావుపేట/వీర్నపల్లి/బోయినపల్లి/కోనరావుపేట: మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ ప్రాముఖ్యత, సబ్సిడీ వివరాలను రైతులకు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో పాటు అంతర పంటలుగా వివిధ రకాల పంటలు సాగుచేసుకోవచ్చన్నారు. ఒకసారి ఆయిల్ పామ్ మొక్కలు నాటితే నాలుగేళ్ల నుంచి మొదలై 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. కనిష్ఠంగా, గరిష్ఠంగా ధరలు టన్నుకు రూ.10 వేల నుంచి రూ.24వేల వరకు ధరలు పలుకుతున్నాయన్నారు. ప్రభుత్వమే 90శాతం సబ్సిడీపై మొక్కలతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతికి అవకాశం కల్పిస్తోందన్నారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటాయని రైతులు రూ.1140 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుచేసిన రైతులకు కొనుగోలు ఒప్పందపత్రాలు అందించారు. ఆయిల్‌పామ్ సాగుచేసి లాభంపొందిన రైతులను సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయానికి విరాళం అందిస్తున్న దాతలు

కోనరావుపేట: మండలం పల్లిమక్తలో నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన కదిరె లచ్చిరెడ్డి రూ.5011 అందించారు. గ్రామంలో పెద్దమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించి విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు జాగీరు కనుకయ్య రూ.5016, కదిరె నారాయణ రూ. 5వేలు, ఆర్ఎంపీ వైద్యుడు నందగిరి నర్సయ్య రూ.2016, అలిపిరి మల్లయ్య రూ. 2,501, ఆదరవేణి దేవయ్య రూ.1016 చొప్పున అందించారు. అలిపిరి సుజాత –అంజిరెడ్డి దంపతులు ఆలయ ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మించారు.

మభ్యపెట్టకుండా పనులు ప్రారంభించాలి



డీసీసీ కార్యదర్శి తిరుపతి

రుద్రంగి: ఎన్నికలు సమీపిస్తున్నక్రమంలో ప్రజలను మభ్యపెట్టేందుకు రుద్రంగిలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఆమోదం వచ్చిందని క్షీరాభిషేకాలు, పనులు ప్రారంభిస్తామని భూమిపూజలు చేస్తున్నారని, 2018 ఎన్నికల సమయంలో కూడా ఇలాగే సూర మ్మ ప్రాజెక్టు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించి ఓట్లు దండుకున్నారన్నారు. కానీ నేటికి తట్టెడు మట్టి కూడా తీయకుండా ప్రజలను మోసం చేశారని, రుద్రంగిలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు పనులు ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రుద్రంగి మండలకేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాట్లాడారు. ఇప్పటి కే 30పడకల ఆస్పత్రికి 30సార్లు భూమిపూజ చేశార ని ఎద్దేవాచేశారు. రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలప్రహరీ నిర్మాణానికి భూమిపూజచేసి ఐదేళ్లు గడుస్తున్నా నేటికి ప్రహరీ నిర్మించలేదన్నారు. రుద్రంగిలో పూర్తిగా ధ్వంసమైన రోడ్డుతో నిత్యం ప్ర యాణికులు నరకయాతన అనుభవిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకాలు చేయడం హ స్యాస్పదంగా ఉందన్నారు.కార్యక్రమంలో డీసీసీ కా ర్యదర్శి చెలుకల తిరుపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, శ్రీనివాస్, దిలీప్, పరందాము తదితరులు ఉన్నారు.

శానిటేషన్ డ్రైవ్ పరిశీలన

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న శానిటేషన్ డ్రైవ్‌ను శనివారం ఎంపీడీవో పి.లచ్చాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓబులాపూర్, అంకిరెడ్డిపల్లె గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శి లావణ్య, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

వాలీబాల్ విజేత చీర్లవంచ

బోయినపల్లి: మండలంలోని కొదురుపాకలో శనివారం మైలారం నారాయణ స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో చీర్లవంచ జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో చీర్లవంచ, కొదురుపాక పోటీపడ్డాయి. విజేతగా నిలిచిన చీర్లవంచకు రూ.6వేలు ట్రోఫీ, సెకండ్ బహుమతి కొదురుపాక జట్టుకు రూ.3వేలు ట్రోఫీఅందించారు

సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



బోయినపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



తంగళ్లపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/గంభీరావుపేట/బోయినపల్లి/వేములవాడఅర్బన్/ముస్తాబాద్: వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తామని కేబినెట్‌లో ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వీఆర్ఏలను రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో వీఆర్ఏలు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తహసీల్దార్ జయంత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బస్సు పనివేళల్లో మార్పులు




డీఎంకు వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్‌యాదవ్

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల డిపో నుంచి ఎల్లారెడ్డిపేట వయా సిద్దిపేట మీదుగా సికింద్రాబాద్‌కు నడిపించే ఎక్స్‌ప్రెస్ బస్‌వేళల్లో మార్పులు చేయాలని డిపో మేనేజర్ మనోహర్‌కు మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ శనివారం వినతిపత్రం అందించారు. డీఎం స్పందించి బస్‌వేళల్లో మార్పులు చేశారు. ప్రస్తుతం మారిన బస్సువేళల ప్రకారం.. డిపో నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి ఎల్లారెడ్డిపేటకు 6.30 చేరుకుంటుందన్నారు. ఇక్కడి నుంచి నారాయణపూర్, సింగారం, బండలింగంపల్లి, కొండాపూర్, గూడెం మీదుగా వయా ముస్తాబాద్, సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తుందన్నారు. బస్సు వేళల్లో మార్పులను ప్రయాణికులు గుర్తించాలని డీఎం మనోహర్, బాల్‌రాజ్‌యాదవ్ కోరారు.

రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లు

సిరిసిల్లటౌన్: అధికారుల అండతోనే మిల్లర్లు ఐకేపీ సెంటర్లలో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి పేర్కొన్నారు. శనివారం ఐకేపీ సెంటర్లను సందర్శించిన మాట్లాడారు. యాసంగి ధాన్యం సేకరణ జిల్లాలో నామమాత్రంగానే సాగుతోందన్నారు. తరుగు పేరుతో క్వింటాలుకు 6 నుంచి 8 కిలోలు అధికంగా తూకం వేస్తున్నారన్నారు. సోమ నాగరాజు, అజ్జ వేణు, వడ్డేపల్లి లక్ష్మణ్, అర్జున్ తదితరులు ఉన్నారు.

లారీల కొరతతో రైతుల ఇబ్బందులు



సిరిసిల్లఅర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత లేకుండా చూడాలని, కొనుగోళ్లలో వేగం పెంచాలని 10వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. కేంద్రం ప్రారంభించి 45 రోజులు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సకాలంలో లారీలు రాక తూకంవేసిన బస్తాలు కల్లాల్లోనే ఉన్నాయని, ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు పడిగాపులుగాస్తున్నారన్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారని, వాతావరణంలోని మార్పులతో ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అటు రైస్‌మిల్లర్లు తేమ పేరిట ధాన్యంలో తరుగుతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్, కలెక్టర్ స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి





కోనరావుపేటలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న నరేశ్, వినతిపత్రం సమర్పిస్తున్న వీవోఏలు

కోనరావుపేట: గ్రామాల్లో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించి, వేతనాలు అందించాలని లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. కోనరావుపేటలో వీవోఏలు చేస్తున్న సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. వారి సమ్మెకు మద్దతు ప్రకటించి నరేశ్ మాట్లాడుతూ.. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న వీవోఏలకు కనీసం రూ. 26వేల వేతనాన్ని అందించాలన్నారు. బీమా తదితర సౌకర్యం కల్పించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెలో అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలపరిషత్‌లో నిర్వహించిన సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకాగా వీవోఏలు అక్కడికి వెళ్లి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం సమర్పించారు. జెడ్పీటీసీ ఏశ వాణి, ఎంపీటీసీ నర్సవ్వ, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, వీవోఏలు ఉన్నారు.



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారుల తో శనివారం పంచాయతీరాజ్ శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శానిటేషన్ డ్రైవ్, తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఎంపీడీవో పి.లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం



చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు గ్రామపెద్దలు సమర్పించగా, అర్చకులు స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణానంతరం మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. స్వామివారి కల్యాణంలో రుద్రంగి మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, డైరెక్టర్ పోతురాజు నగేశం, చందుర్తి సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, బీజేపీ నాయకులు అల్లాడి రమేశ్, మార్త సత్తయ్య పాల్గొని పూజలు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.